క్లుప్తంగా

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న హెచ్‌ఎం, దాత

సీఎస్‌పురం(పామూరు): విద్యాభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని హెచ్‌ఎం ఎస్.వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక ఎస్టీ కాలనీ పాఠశాలలో శనివారం సీఎస్‌పురంకు చెందిన దాత నాయబ్‌రసూల్ సొంతనిధులతో సమకూర్చిన నోట్‌బుక్స్‌ను అందజేశారు. ఎస్‌ఎంసీ చైర్మన్ బి.సాయిలక్ష్మి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

హనుమంతునిపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై మాధవరావు హెచ్చరించారు. స్థానిక హాజీపురం అడ్డరోడ్డులో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. అతివేగంగా నడిపి ప్రమాదాలకు గురి కావద్దన్నారు. అనంతరం హనుమంతునిపాడు, వేములపాడు బస్టాండ్ సెంటర్‌లో గ్రామస్తులతో మాట్లాడారు.

పొన్నలూరులో మోస్తరు వర్షం



పొన్నలూరు హైస్కూల్లో నిలిచిన వర్షం నీరు

పొన్నలూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఆయా పంట పొలాలు, వాగుల్లోకి వర్షం నీరు చేరాయి. ప్రధానంగా పొన్నలూరు, ముత్తరాసుపాలెం, వెల్లటూరు, ముప్పాళ్ల, చెరుకూరు, కె.అగ్రహారం గ్రామాల్లో ఓమోస్తారు వర్షం పడింది. ప్రస్తుతం ఈ వర్షం మెట్ట పైర్లు సాగుకు బాగా ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా కర్ర తోలితే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై కోటయ్య

పీసీపల్లి: రాత్రిళ్ల అక్రమంగా తోలితే చర్యలు తప్పవని ఎస్సై జి.కోటయ్య అన్నారు. వెంగలాయపల్లిలో అక్రమంగా తరలిస్తున్న కర్ర చలానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కట్టెల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రైవర్లు ప్రతి ఒక్కరూ వారి వారి వాహనాలకు ముందు వెనుక రేడియం స్టిక్కర్లను అమర్చుకోవాలని సూచించారు. అనంతరం మోటార్ వెహికల్ యాక్టుపై అవగాహన కల్పించారు.

రక్త దాతకు సత్కారం



కానిస్టేబుల్ చంద్రశేకర్‌ను సన్మానిస్తున్న ఎస్సై

టంగుటూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బచ్చల చంద్రశేఖర్‌ది అరుదైన ఏబీ నెగెటివ్ బ్లడ్ గ్రూపు. ఈ రక్తం దొరకడం రక్త నిల్వ కేంద్రాల్లో కూడా చాలా కష్టంగా ఉంటుంది. దీంతో చంద్రశేకర్ ఎన్నో గుండె సంబంధిత ఆపరేషన్లు కాన్పు సమయంలో అధిక రక్తస్రావం అయిన వారికి అర్ధరాత్రైనా వెళ్లి రక్తదానం చేశారు. దీంతో బ్లడ్ డోనార్స్ గ్రూపు ప్రతినిధులు, టంగుటూరు ఎస్సై వి.నాగమల్లేశ్వరరావులు చంద్రశేఖర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రాణాపాయంలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తాన్ని ఇవ్వడం ఎంతో ఆదర్శమన్నారు. కార్యక్రమంలో చన్నా వెంకట రామారాంజనేయులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.8 50 లక్షలు

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసిన శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం ఆదాయం శనివారం రూ.8,56,839 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.18,480, తలనీలాలు రూ.31,700, ప్రత్యేక దర్శనం రూ.2,06,500, లడ్డూ ప్రసాదాలు రూ.1,71,800, అన్నదానం రూ.3,19,793, రూమ్ అద్దెలు రూ.32,700 కలిపి రూ.8,56,839 వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ఆలయ అధికారుల పర్యవేక్షణలో జరిగింది.

క్రీడలతో మానసిక ఉల్లాసం



మండల స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు



కబడ్డీలో పాల్గొన్న విద్యార్థినులు

సింగరాయకొండ: క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందటంతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందని ఎంఈఓ కత్తి శ్రీనివాసరావు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరు త్వరలో నియోజకవర్గ స్థాయిలో జరిగే ఆటల పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్‌డీ జంషీర్ వివరించారు.

కొండపి(సింగరాయకొండ): విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమని ఎంఈఓ-2 రామారావు అన్నారు. మండలంలోని కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సూసన్నకుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అండర్ 14,17 బాలికల స్కూల్ గేమ్స్ ఎంపికల పోటీలను ఆయన ప్రారంభించారు. బాలికల విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీలకు కన్వీనర్‌గా ఏ కిరణ్ వ్యవహరించారు.

టంగుటూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి జయంత్‌బాబు, బెజవాడ వెంకటేశ్వర్లు, దామచర్ల శ్రీధర్, ఎంఈఓ చెంచుపున్నయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో ఆర్డినేటర్ అరుణ, ప్రధానోపాధ్యాయురాలు తులసి ప్రభ, స్టాఫ్ సెక్రటరీ యాకోబు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తుల్లిబిల్లి అశోక్‌బాబు, పీడీలు మోహన్, వెంకట్రావు, ఉష, కౌసల్య, జయలక్ష్మి పాల్గొన్నారు.



టంగుటూరులో ప్రతిభ చాటిన విద్యార్థులు

పొగాకు అత్యధిక ధర రూ. 358



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం జరిగిన వేలంలో అత్యధిక ధర రూ.358 పలికింది. జమ్ములపాలెం, తుమాడు గ్రామానికు చెందిన రైతులు 1049 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 859 కొనుగోలు చేసి 190 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.190, సరాసరి రూ.311.42 పలికింది. వేలంలో 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపి(సింగరాయకొండ): స్థానిక వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 1078 బేళ్ల కొనుగోలు చేసినటుల వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. నేతివారిపాలెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు 1426 బేళ్లను తీసుకురాగా 1078 బేళ్లను కొనుగోలు చేయగా 348 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.169, సరాసరి రూ.267.26 పలికింది. వేలంలో 11 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు వరం



పౌష్టికాహార మాసోత్సవంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సరోజిని

పామూరు: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు వరం లాంటివని ఐసీడీఎస్ సీడీపీఓ పి.సరోజిని అన్నారు. పామూరు ఎర్రచేలు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనలో సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు పౌష్టిక విలువలు అధికంగా ఉండే ముడి విత్తనాలు తినాలని తద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. పుట్టిన బిడ్డకు విధిగా ముర్రుపాలు తాగించాలని, ముర్రుపాలలో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. అనంతరం పౌష్టికాహారం పంపిణీ చేసి అవగాహన ర్యాలీ, గర్భిణిలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వంకేశ్వరం నాగవాణి, రమీజాబి, ఇర్రి కృష్ణవేణి, రాజేశ్వరి, క్రిష్ణవేణి, అనిత, లక్ష్మీరాజ్యం, షేక్. రుహి, గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల తల్లులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్యంతో వ్యాధులు దూరం



పామూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది



కనిగిరిలో ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

పామూరు: నివాస గృహాలు, గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యంతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ షేక్.నాయబ్‌రసూల్ అన్నారు. పామూరులో శనివారం స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వారి వారి నివాసాల మధ్యం చెత్త చెదారం లేకుండా చూడాలని, డస్ట్‌బిన్‌లలో తడిచెత్త, పొడిచెత్తను విడివిడిగా వేసి పంచాయతీ చెత్త సేకరణ వాహనాలు వచ్చినప్పుడు అందులో వేయాలన్నారు. నివాసాల మధ్య మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని, తద్వారా దోమలను నివారించి డెంగీ, మలేరియా, ఇతర దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను దూరంగా ఉంచవచ్చన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు రజనీకాంత్, బ్రహ్మయ్య, మహిళా పోలీసులు, అనూష, శ్రీదేవి, జీహెచ్ఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ షేక్.అబ్దుల్ గఫార్ అన్నారు. కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో శనివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వ్యర్థాలను మున్సిపల్, వైద్యశాల పారిశుధ్య సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. మున్సిపల్ కౌన్సిలర్ దేవరాజ్, డీసీహెచ్ ఇన్‌చార్జి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ కలాం, డాక్టర్ వెంకట సుబ్బయ్య, శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ హెల్త్ అసిస్టెంట్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి



టంగుటూరులో కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

టంగుటూరు: ముసికి సాగర్ నీరు సాధనకు ఈ నెల 25న జరగనున్న సదస్సును జయప్రదం చేయాలని రైతు కూలీ సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సదస్సు కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశమంతా వరదలు పారుతున్న ఈ ప్రాంతంలో వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ స్థితిలో ముసికి సాగర్ నీరు సాధనకు ముసి పరివాహక ప్రాంతంలోని రైతులు, కూలీలతో కలిసి చర్చించేందుకు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, రైతు సంఘ నాయకులు వేజండ్ల సింగయ్య, రైతు కూలీ సంఘాల జిల్లా నాయకులు పరిటాల కోటేశ్వరరావు, నత్తల నాగరాజు, ప్రజా సంఘాల నాయకులు బొడ్డు సతీష్, టి. ప్రభాకర్, టి.రాము, వి.మోజెస్, జి.వెంకటరావు, తన్నీరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ ఓరియంటెడ్ కేంద్రం ప్రారంభం



జాబ్ ఓరియంటెడ్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల్లో జాబ్ ఓరియంటెడ్ కోచింగ్ కేంద్రం ఏర్పాటుచేయడం విద్యార్థులకు వరం లాంటిదని ఎంఈఓ జగన్నాథం ప్రసాదరావు అన్నారు. మండలంలోని శీలంవారిపల్లె కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్లస్‌లో శనివారం జాబ్ ఓరియంటెడ్ కోచింగ్ కేంద్రాన్ని ఎంఈఓ ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లస్‌టు పాఠశాలలో కోచింగ్‌సెంటర్ ఏర్పాటు ద్వారా ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు చదువుతూనే ఉద్యోగం అనే లక్ష్యంతో స్పోకెన్ ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, అర్థమెటిక్, మెంటల్ ఎబిలిటి తదితర అంశాలపై విద్యార్థులకు నిత్యం ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. హెచ్‌ఎం నాగినేని తిరుపతయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ మూరం మస్తాన్‌రెడ్డి, అధ్యాపక సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూచేపల్లి సమర్థవంతమైన నాయకుడు

పీసీపల్లి: దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి సమర్థవంతమైన నాయకుడని, అందుకే పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించారని పార్టీ మండల అధ్యక్షుడు బొర్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ లక్ష్మీ కాంతం ఓకేరెడ్డి, ఎంపీపీ అత్యాల జపన్య, సర్పంచులు, ఎంపీటీసీలు హర్షం వ్యక్తం చేశారు.

అనంతవరంలో వైద్య శిబిరం



అనంతవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సీహెచ్ఓ మాతయ్య

సాక్షి ఎఫెక్ట్..

టంగుటూరు: 'అనంతవరంలో విజృంభిస్తున్న జ్వరాలు' శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనానికి వైద్య శాఖ, పంచాయతీ అధికారులు స్పందించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓ మాతయ్య, వైద్య సిబ్బంది శనివారం అనంతవరంలో ఎస్సీ కాలనీ, గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేశారు. వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఐదుగురికి జ్వరాలు గుర్తించి ఒకరికి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఒంగోలు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. దోమలు పుట్టే ప్రాంతాలపై అవగాహనకల్పించారు. అనంతరం గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించామని సీహెచ్ఓ మాతయ్య తెలిపారు.

ఘనంగా ఆల్ఫా డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న మాల కొండారెడ్డి



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

కనిగిరి రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆల్ఫా విద్యా సంస్థల అధినేత జి.మాలకొండారెడ్డి అన్నారు. స్థానిక గార్లపేట రోడ్డులోని నందు గ్రాండ్స్ ఫంక్షన్ హాల్‌లో ఆల్ఫా డిగ్రీ కళాశాల ఫస్ట్ ఇయర్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు జరిగాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జి.మాల కొండారెడ్డి, కరణం చెంచుబాబులు బహుమతు అందచేశారు. పామూరు అక్షర ఇన్‌స్టిషన్ కరస్పాండెంట్ కె.బాబు రంగారావు, విజేతల విద్యా సంస్థల అధినేత పసుపులేటి అరుణోధర్, డైరక్టర్లు పాపిరెడ్డి, శివ, జ్యోతి, సమీర్, మీరావలి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిఅస్త్రంతో పచ్చ పురుగు నివారణ



కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారి విజయలక్ష్మి

టంగుటూరు: అగ్నిఅస్త్రంతో పచ్చ పురుగును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయాధికారి తుమ్మలపూడి విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని మర్లపాడులో ఐసీఆర్పీ, సీఆర్పీ, యువ రైతు జ్యోత్స్న అగ్నిస్త్రం కషాయం తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ కషాయాన్ని ఏ పంట పైనా పిచికారీ చేయటం వల్ల పచ్చ పురుగుతో పాటు చీడపీడ పురుగును నివారించవచ్చన్నారు. ప్రకృతి సేద్యంలో పెట్టుబడి తగ్గడంతో పాటు పంట అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు. ప్రకృతి వ్యవసాయాధికారులు వెంకటరావు, ఐసీఆర్పీలు సుజాత, హరిత, శృతి, త్రివేణి, జోత్స్న పాల్గొన్నారు.

ఆరికట్ల సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న కోటిలింగయ్య

కొండపి (సింగరాయకొండ): వైఎస్సార్ సీపీ బలోపేతానికి ఆరికట్ల వెంకటేశ్వర్లు ఎంతో కృషి చేశారని పార్టీ మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగయ్య అన్నారు. మాజీ మండల కన్వీనర్ ఆరికట్ల వెంకటేశ్వర్లు మూడో వర్ధంతిని పురస్కరించుకొని సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కష్ట కాలంలో పార్టీ కోసం నిలబడి నాయకులకు, కార్యకర్తలకు ధైర్యాన్ని ఇచ్చారన్నారు. కొండపి మండల జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, ఆరికట్ల హరినారాయణ, వైస్ ఎంపీపీ కోటరాజు, వెంకయ్య, చిన్నబ్బి, శేఖర్ రెడ్డి, కొర్నెలు, శ్రీను పాల్గొన్నారు.

రక్తదానం చేయండి



ఏరియా వైద్యశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కందుకూరు రూరల్: రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ అన్నారు. కందుకూరు ఏరియా వైద్యశాలలో టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తం అవసరమైనప్పుడు మాత్రమే దాని విలువ తెలుస్తుందన్నారు. ఏరియా వైద్యులు మొహమ్మద్ షజావుద్దీన్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో తెలియజేశారు. కొంత మందిలో రక్తదానంపై అపోహాలు ఉన్నాయన్నారు. కానీ రక్తదానం చేయడం వల్ల మన శరీరానికి కొత్త రక్తం పునరుత్పత్తి అవుతుందని తెలిపారు. ఏరియా వైద్యశాల టెక్నీషియన్ ఎస్.రామారావు, స్టాఫ్ నర్సులు శ్రీలత, సహాయకులు సుకుమార్, శివాజీ పాల్గొన్నారు.

పెరటి తోటలు పెంచుకోవాలి



గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రభావతి

కందుకూరు రూరల్: ఇళ్ల వద్ద పెరటితోటల్లో కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యు.ప్రభావతి సూచించారు. మహదేవపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో దొరికే కూరగాయలు ఎక్కువగా పురుగు మందులు వాడినవే అమ్ముతున్నారని తెలిపారు. అందుకే గ్రామీణ ప్రాంతల్లో ఇళ్ల ముందు ఉండే ఖాళీ స్థలంలోనే కూరగాయ మొక్కలు నాటుకోవాలని చెప్పారు. వీటితోపాటు ఆకు కూరలు కూరలు కూడా పెంచుకోవాలన్నారు. ఇళ్ల వద్ద పెంచే మొక్కలకు గేదె ఎరువు, ఇళ్లలో వచ్చే వ్యర్థ పదార్థాలను ఎరువులుగా మార్చి మొక్కలకు వేస్తే బాగా పెరుగుతాయని చెప్పారు. అదే విధంగా అంగన్‌వాడీలో అందించే పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త రజినికుమారి, ఆయా సునీత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సముద్రంలో యువకుడు గల్లంతు

● కాపాడిన మెరైన్ పోలీసులు



మెరైన్ పోలీస్‌తో దుర్గారావు

సింగరాయకొండ: అలల తీవ్రతకు ఓ యువకుడు సముద్రంలో గల్లంతవగా, మెరైన్ పోలీసులు కాపాడారు. ఈ సంఘటన మండలంలోని పాకల బీచ్‌లో శనివారం జరిగింది. మెరైన్ పోలీసుల కథనం ప్రకారం.. పొన్నలూరు మండలం రావులకొల్లు ఎస్టీకాలనీకి చెందిన కొమరగిరి దుర్గారావు (24) గ్రామస్తులతో కలిసి వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా పాకల బీచ్‌కు వచ్చాడు. నిమజ్జనం తర్వాత సముద్ర స్నానం చేస్తుండగా, అలల ఉధృతికి నీటిలో గల్లంతయ్యాడు. కొందరు గమనించి కేకలు వేయడంతో.. తీరంలో బందోబస్తు నిర్వహిస్తున్న మెరైన్ కానిస్టేబుల్ పి.రాజేష్, హోంగార్డు కె.మస్తానయ్య వెంటనే అప్రమత్తమై నీటిలో దూకి సేఫ్టీ రింగును దుర్గారావుకు వేసి రక్షించి ఒడ్డుకు తరలించారు. దుర్గారావు బేల్దారి పనులు చేస్తుంటాడు. తన ప్రాణాలు కాపాడిన మెరైన్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.